# రాష్ట్ర అభివృద్ధే..

# నా సంకల్పం



ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ
- రాష్ట్రంలో రూ.14,523 కోట్ల ప్రాజెక్టులకు అంకురార్పణ
- 10 వేల కిలోమీటర్ల రోడ్డు నెట్‌వర్క్‌కు శ్రీకారం
- ఉత్కళ వర్సిటీలో ప్రత్యేక పీఠం
- లలిత గిరిలో మ్యూజియం

**భువనేశ్వర్:** ఒడిశా అభివృద్ధి తన సంకల్పంగా పాలన కొనసాగిస్తున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. రాష్ట్రానికి సోమవారం విచ్చేసిన ఆయన రాష్ట్రంలో రూ.14,523 కోట్ల ప్రాజెక్టులకు అంకురార్పణ చేశారు. స్థానిక భారతీయ సాంకేతిక సంస్థ (ఐఐటీ) ప్రాంగణం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. వీటిలో ఉన్నత విద్య, ఆరోగ్యం. పైప్‌లైన్ వంట గ్యాస్, రహదారుల విస్తరణ, సాంస్కృతిక ప్రాజెక్టులు ఉన్నాయి. స్థానిక ఐఐటీ బహుముఖ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.1,260 కోట్లు వెచ్చించింది. రూ.1,600 కోట్ల వ్యయ ప్రణాళికతో బరంపురం ఐజర్ సొంత భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జ్ఞానం-సృజనాత్మక ఆవిష్కరణల కేంద్రంగా ఐజర్ బరంపురం సంస్థ అంచెలంచెలుగా గుర్తింపు సాధించే రీతిలో భావి కార్యాచరణ రూపొందించినట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. అత్యాధునిక సాంకేతిక విద్యాధికుల ఆవిర్భావ కేంద్రంగా రాష్ట్రం వెలుగొందేందుకు ఈ ప్రాంతంలో ఏర్పాటైన ఐఐటీ, ఐజర్, నైజర్ సంస్థలు దోహదపడతాయని ప్రధాన మంత్రి తెలిపారు.

## ఆరోగ్య పరిరక్షణ పట్ల శ్రద్ధ

విద్యా రంగం అభివృద్ధితో పాటు దేశ ప్రజల ఆరోగ్య పరిరక్షణ పట్ల కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఖుర్దా జిల్లా భువనేశ్వర్ ప్రాంతంలో ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్సు ఆస్పత్రిని విస్తరించారు. గతం కంటే రెండింతల పడకల్ని పెంచారు. ఈ ఆస్పత్రిలో ప్రసూతి, శస్త్ర చికిత్స, స్త్రీ రోగ చికిత్సలు అత్యున్నత స్థాయిలో లభిస్తాయి. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల తరహాలో ఇక్కడ చికిత్స, వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చినట్లు ప్రధాన మంత్రి తెలిపారు. దేశంలోని మారుమూల ప్రాంతాల్లో మౌలిక ఆరోగ్య సదుపాయాలు లభ్యం కాని దళిత, బడుగు వర్గాలు సైతం ఉన్నత వైద్య, చికిత్స సదుపాయాల్ని పొందేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకం ప్రవేశ పెట్టింది. దేశ వ్యాప్తంగా హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటవుతాయని చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూడా దాదాపు 1150 హెల్త్ అండ్ వెల్ నెస్ కేంద్రాలు ఏర్పాటవుతాయి. రానున్న ఒకటి, రెండేళ్లలో ఈ కేంద్రాల ఏర్పాటు పూర్తవుతుందని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

## శరవేగంగా రహదారుల విస్తరణ

దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు రోడ్డు మార్గంలో రవాణా వ్యవస్థను విస్తరించేందుకు రహదారుల విస్తరణ శరవేగంగా సాగుతోంది. ట్రాఫిక్ జామ్ నివారణ దృష్ట్యా దేశ వ్యాప్తంగా అధునాతన రీతితో రోడ్ల నిర్మాణం కొనసాగుతుంది. హై వే విస్తరణతో మారుమూల ప్రాంతాలకు పక్కా రహదారుల నిర్మాణం నిరవధికంగా చేపడుతున్నారు. చాంద్‌బాలి-భద్రక్ సెక్షన్, టంగి-పొంయితొాలా సెక్షన్, కటక్-అనుగుల్ సెక్షన్‌లో జాతీయ రహదారుల్ని 4 అంచెలు, 6 అంచెలు రహదారులుగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.4.5 వేల కోట్లు వెచ్చిస్తుందని ప్రధాని తెలిపారు.

## గ్యాస్ పైప్‌లైన్‌తో గుర్తింపు

పారాదీప్-హైదరాబాద్ గ్యాస్‌పైప్ లైన్ నిర్మాణం రాష్ట్రానికి కొత్త ఉనికి సాధిస్తుంది. ఈ లైను నిర్మాణంతో స్థానిక యువతకు అద్భుతమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయి. సుమారు 1,200 కిలోమీటర్ల పొడవునా గ్యాస్‌పైప్ లైను ఏర్పాటవుతుంది. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు గ్యాస్ ఉత్పాదిత సేవలు పైప్‌లైన్ ఆధ్వర్యంలో లభిస్తాయి. పారాదీప్ రిఫైనరీ నుంచి ఉత్పత్తి అయ్యే పెట్రోల్, డీజిల్, కిరసనాయిలు, విమానాల ఇంధనం పలు పట్టణాలు, నగర ప్రాంతాలకు పైప్‌లైన్ ద్వారా పంపిణీ చేస్తారు. దీని వ్యయ ప్రణాళిక రూ.4 వేల కోట్లు. బరంపురం, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ ప్రాంతాల్లో డెలివరీ కమ్ పంపింగ్ స్టేషన్లు నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పారాదీప్ తూర్పు భారత దేశపు హబ్‌గా నిలుస్తుందని ప్రధాన మంత్రి తెలిపారు.

## ఉత్కళలో ప్రత్యేక పీఠం

పాయికా విప్లవం 200 ఏళ్లు పూర్తిని పురస్కరించుకుని స్మారక నాణాన్ని ప్రధాన మంత్రి ఆవిష్కరించారు. ఈ విప్లవ నాయకుడు బక్షి జగబంధు పేరుతో ఉత్కళ విశ్వ విద్యాలయంలో ప్రత్యేకంగా చైర్ ప్రారంభమైంది. దీని కోసం కేంద్ర ప్రభుత్వం

- మిగతా 2వ పేజీలో ▶

# నా సంకల్పం



ఐఐటీ ప్రాంగణంలో సభా వేదికపై అతిథి ప్రముఖులు




ప్రధాన మంత్రికి జ్ఞాపిక బహూకరిస్తున్న ఐఐటీ డైరెక్టరు, చైర్మన్‌లు

మొదటి పేజీ తరువాయి

రూ.5 కోట్లతో కార్పస్ నిధి ఏర్పాటు చేసింది. పాయికా, ఆదివాసీల ఆందోళన అంశాల్ని పరిశోధించేందుకు ఈ చైర్ దోహదపడుతుంది. రాష్ట్రంలో ఆదివాసీ, దళితుల ఆర్థిక, సామాజిక పురోగతికి ఈ చైర్ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రాచీన స్వాతంత్ర్య సమరంలో రాష్ట్ర ఆదివాసీ, దళితుల పాత్ర ప్రపంచం వెలుగులోకి వస్తుంది. లలితగిరి ప్రాంతంలో రూ.9.5 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రాచీన పురావస్తు మ్యూజియంను ప్రధానమంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్, కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, దళిత వ్యవహారాల శాఖ మంత్రి జ్యుయల్ ఓరం, స్థానిక లోక్‌సభ సభ్యుడు డాక్టర్ ప్రసన్న కుమార్ పటసహాణీ, ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసరు ఆర్.వి.రాజకుమార్, బరంపురం ఐజర్ సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.ఆర్. చారి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



పలు ప్రాజెక్టుల్ని రిమోట్‌తో ప్రారంభించిన ప్రధాన మంత్రి



కొత్త పోస్టలు స్టాంప్ ఆవిష్కరణ




ఉత్కళ విశ్వ విద్యాలయంలో బక్షి జగబంధు పీఠం ఏర్పాటు రాజపత్రం సమర్పిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

## పాయికా విప్లవాన్ని..

# తొలి స్వాతంత్య్ర సమరంగా ప్రకటించాలి


ప్రధాన మంత్రిని అభ్యర్థిస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్


కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రితో నవీన్ పట్నాయక్ సంప్రదింపులు


ప్రధానికి కరచాలనంతో స్వాగతం పలుకుతున్న నవీన్ పట్నాయక్

- ప్రధానికి ముఖ్యమంత్రి అభ్యర్థన
- కొత్త ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేయాలని విన్నపం

**భువనేశ్వర్:** దేశ స్వాతంత్య్ర సమరంలో తొలి యోధుడు దివంగత బక్షి జగబంధు రాష్ట్రానికి వర పుత్రుడు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఆయన సారథ్యంలో పాయికా విప్లవం జరిగింది. దేశంలో ఇదే తొలి స్వాతంత్య్ర సమర శంఖారావంగా చరిత్ర పుటలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో పాయికా విప్లవాన్ని తొలి స్వాతంత్య్ర సమరంగా ప్రకటించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అభ్యర్థించారు. స్థానిక భారతీయ సాంకేతిక సంస్థ (ఐఐటీ) ప్రాంగణం నుంచి పలు ప్రాజెక్టుల ప్రారంభం, శంకుస్థాపనకు విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సాదరంగా స్వాగతం పలికారు. పాయికా విప్లవం స్మృతికి చిహ్నంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక మ్యూజియం ఏర్పాటుకు యోచించడంపట్ల ముఖ్యమంత్రి అభినందించారు. ఈ మ్యూజియం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా స్థలం కేటాయిస్తుందని సభాముఖంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. బక్షి జగబంధు స్మృతి కింద రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వసుధ పరిశుద్ధ తాగు నీటి ప్రాజెక్టు కోసం సభా వేదికపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రస్తావించారు. రాష్ట్రంలో ప్రారంభమైన పాయికా విప్లవం దేశ వ్యాప్తంగా పెను సవాల్‌గా నిలిచింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఒక రోజు రాష్ట్ర పర్యటనను పురస్కరించుకుని రూ.14 వేల 523 కోట్ల విలువైన ప్రాజెక్టులకు అంకురార్పణ చేశారు. ఈ ప్రాజెక్టుల్ని సకాలంలో పూర్తి చేయాలని ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అభ్యర్థించారు. వరుసగా 7 స్నాతకోత్సవాల్ని విజయవంతంగా జరుపుకున్న స్థానిక భారతీయ సాంకేతిక సంస్థ (ఐఐటీ) ఉజ్వల భవిష్యతుతో నిరవధికంగా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆకాంక్షించారు. వైజ్ఞానిక–సాంకేతిక పరిజ్ఞానంతో మేధావుల్ని ఆవిష్కరించడంలో ఈ సంస్థ నిరవధికంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.